


"హల్లో! కౌశ........"

"ఆఁ. నేనే మాట్లాడుతున్నాను."

"మేమంతా మీ కోసం చూస్తున్నామండీ. ఇంకా బయల్దేరలేదూ?" కరుణ అడుగుతోంది.

"లేదండీ. కొంచం పని...."

"ఓహోహో! ఆ కారణాలన్నీ చెప్పి రావడం ఎగ్గొట్టడానికి చూస్తున్నారేమో? అదేం కుదరదండి. మీరు రావలసిందే."

నేను సమాధానం చెప్పేలోగా ఆమె చేతిలోంచి రిసీవర్ మరొకరు లాక్కొన్నట్లుగా తెలుస్తోంది.

"హల్లో. గుర్తుపట్టారా? నేను విమలను."

"అయ్యయ్యో. గుర్తు పట్టకేమండీ?"

"యేమోలెండి, మావంటి సామాన్యులం ........మీ వంటి నాయకులకు ఎందుకు జ్ఞాపకం వుంటాం గానీ........"

"ప్లీజ్, అటువంటి ఆరోపణలు వద్దు" అన్నాను.

"సరే. మరైతే మీరింకా బయలుదేర లేదేం మరి? ఇక్కడ రావలసిన అంతా వచ్చేశారు. మీ కోసమే ఎదురుచూస్తున్నాం."

అంతలో మరో కంఠం పలికింది. రిసీవర్‌తో పాటు వింటూన్న చెవిలో పొరలు కూడా బ్రద్దలై పోతాయా అన్నట్లుగా—

"ఎప్పటి కప్పుడు మేము రమ్మనడం—మీరు ఏవో సాకులు చెప్పి తప్పించుకోవడం-సంవత్సరాలు సంవత్సరాలే దొర్లిపోతున్నాయి. ఈ రోజు మీరు రాకుంటే-మేమే వచ్చేస్తాం. అరగంట చూస్తాం మరి. ఏమంటారు? వస్తున్నారా?"

ఇక ఇది తప్పేది కాదు. వీళ్ళు చాలా పట్టుపట్టారు ఇవ్వాళ.

"సరే ఓ ఇరవై నిముషాలలో వచ్చేస్తున్నాను."

"రండి రండి."

వీధిలోనికే ఎదురు వచ్చింది కరుణ. ఆప్యాయంగా ఆహ్వానించుతూ.

ఆమెను వెన్నంటి మరో పదేనమందు గురు స్త్రీలు వున్నారు. నన్నొక్కసారిగా ఉత్సుకతతో చూచారు. అంతలోనే పరుగెత్తినట్లే లోనికి వెళ్ళిపోయారు.

నేనూ, ఆ ఇంటి గృహిణి కరుణా కాక మిగిలినవారు ఓ పదిహేను మంది వున్నారు హాలులో. అందులో నాకు తెలిసిన వారు ఇద్దరు ముగ్గురు మాత్రమే. మిగిలిన అన్నీ క్రొత్తముఖాలే.

"వీరే మీరు చూడాలనుకున్న రచయిత్రి గారు." జనాంతికంగా వున్నది కరుణ మాట్లాడ్తున్నతీరు. ఇద్దరు ముగ్గురు నమస్కారాలు చెప్పారు.

మిగిలినవారు సూటిగా చూడటం తప్పోప్పి లేక నామోషీయో అన్నట్లుగా అటుయిటు దిక్కులు చూస్తూ ఒకొక్క చూపు చూచీ చూడనట్లుగా నావైపు విసుర్తున్నారు.

ఒక్కొక్కరే చాలా శ్రద్ధగా ఖరీదుగా అలంకరించుకున్నారు. చాలా ఆడంబరంగా అగుపించాలనే తాపత్రయం అధికంగా ప్రకటితమౌతూన్నది.

పది నిముషాలు ఆశ్చర్యం గొలిపేంతటి అతి నిశ్శబ్దంతో గడిచిపోయాయి.

ఫలహారాలూ, పానీయాలూ పట్టించుకొచ్చి పంచడం ప్రారంభించింది కరుణ.

స్తబ్దుగా వున్న వాతావరణం చైతన్యవంతమైంది.

"ఈ పార్టీ ఏర్పరచిన విశేషం ఏమిటి? మీ పుట్టినరోజా?" అనడిగాను ప్రక్కనే వచ్చి కూర్చున్న కరుణను.

నవ్వేసింది కరుణ.

"మీకోసమే పార్టీ, మామూలుగా పిలుస్తే మీరు రారుగా మరి? గొప్ప గొప్ప వారిని పిలవడానికి పార్టీలే ఇవ్వాలేమోననీ...."

"సారీ, మీరు నాగురించి ఇంత శ్రమ తీసుకోవడం నాకు బాగుండలేదు." నొచ్చుకుంటూ అన్నాను.

"ఏం చేసేది చెప్పండి? మా ఫ్రండ్సంతా మిమ్మల్ని చూడాలని ఒకటే ఉబలాటంగా వున్నారు. మీరేమో రాకపోతిరి ఎనిసార్లు పిలచినా." ఆరోపణ ధ్వనించింది.

విమలా మరో నలుగురు స్త్రీలూ నాకు దగ్గరగా వచ్చి అభిముఖంగా కూర్చున్నారు.

ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి

వారిముఖాలలో అమితమైన ఉత్సుకత ఏదో కొట్టవచ్చినట్లుగా కవ్పిస్తూన్నది.

విమల ఆ నలుగురినీ నాకు పరిచయం చేసింది.

ఒకామె తాను ఏమ్మే పట్టభద్రురాలనని చెప్పుకొంటూ భర్త గెజిటెడ్ ఆఫీసర్ అని చెప్పింది.

"నేనూ కథలు వ్రాయాలనుకుంటాను కానీ—వెధవది 'మూడ్' కుదరదండి ఆ బ్రహ్మవ్రాత వ్రాయటానికి. ఎన్నో ఐడియా లొస్తుంటాయి. అన్నట్టు, మావారు... కంపెనీలో సీనియర్ ఇంజనీర్" అని పరిచయం చేసుకొన్నది మరొకామె. పేరు లక్ష్మి అట.

"నిజమేనండీ, ఎన్నో భావాలుంటాయి కానీ, తీరా వ్రాద్దామని కూర్చునే సరికి బుఱ్ఱ మైదానంలా అయిపోతుంది. ఒక్క అక్షరం జరగదు. మీ ఓర్పుకి మెచ్చుకోవాలి" అని పెలవిచ్చినామె. గతంలో ఏదో ఉద్యోగంచేసి విరమించుకొన్నదట. ప్రస్తుతం ఎవరో డాక్టరుగారికి గృహిణి అట.

"అన్నట్టు....వారిపేరు కమల" అని చెప్పింది కరుణ.

"మా మహిళా సమాజానికి సెక్రటరీ. చాలా అభ్యుదయ భావాలు గలామె.'

ఈ వివరణలు విని నేను హర్షం ప్రకటించాను, చిరునగవుతో.

"అంతా మేమే మాట్లాడుతున్నాం మీరేం మాట్లాడరేం?" లక్ష్మి అడిగింది.

"ఏదీ—పరిచయాలే ఔతున్నాయి కదా ఇంకా? అయినా ఏమిటి మాట్లాడాలి చెప్పండి?"

"మేము మిమ్మల్ని కొన్ని విషయాలు అడగాలండి, పోనీ సమాధానం ఇస్తారా?" కమల అడిగింది.


"బాగుంది. ఇంటర్వ్యూ అన్నమాట?" నవ్వేశాను. కొద్దిదూరంలోనున్న పక్కన స్త్రీలుకూడ కుతూహలంగా చూస్తూ వింటున్నారు.

"మీరు ఇంటర్వ్యూ అనుకోండి, సందేహాలనుకోండి, మరేమైనా అనుకోండి మేము మీ పాఠకులం. మీ పాఠకుల సందేహాలు మీరు తీర్చవద్దా చెప్పండి" కమల జోరుగా అన్నది.

"అయ్యో, కాదన్నానా చెప్పండి"

అంతా బాగా సర్దుకున్నారు కూర్చున్నారు.

ఓసారి ముఖముఖాలు చూచుకున్నారు.



కమల కంఠం సవరించుకుని ప్రారంభించింది.

"మీరెప్పుడూ పాత పద్ధతులే మంచివి—అని వ్రాస్తారెందుకండీ? ఇది స్త్రీలకు అన్యాయం చేయడం కాదూ?"

నేను కొంచెం ఆలోచించి అన్నాను.

"మీరు మరికొంత వివరించండి. మీ ఉద్దేశ్యం ఏమిటో?"

"అదేనండీ." ఈసారి రెండు కంఠాలు ఒక్కసారి పలికాయి, "మరీ భర్తా ఇల్లూ పిల్లలే ఆడదానికి లోకమని పురాణకాలపు నీతులు వ్రాస్తారు మీరు. విప్లవ పంథాలో వ్రాసి ఏదైనా దారి చూపరాదూ?"

నేను మాట్లాడక పూర్వమే మరో ఆవిడ అతి ఉద్రేకంగా అన్నది ఉపన్యాస ధోరణిలో "మన ఆడ జాతికి దాస్య విముక్తి ఎప్పుడు? మనను బంధించిన ఈ శృంఖలాలను తెంచుకోవాలి. స్వేచ్ఛ పొందాలి."

ఏవేవో బట్టీపట్టిన మాటలని స్పష్టంగా తెలుస్తోంది. నేను నవ్వును అణచుకున్నాను.

"కేవలం వ్రాతలఫలననే మనుష్యుల నడవడిక మారే విషయమైతే—"రామాయణ పుణ్యగ్రంథం" రచింపబడిన తర్వాత నేరాలూ, నేరస్థులూ లేకుండా పోయేవారే."

"ఓ మీరలా మాటల గారడీతో తప్పించుకోలే రండోయ్ ఇవాళ. ప్రతిభవుండీ, మన స్త్రీల సమస్యలపై ఎందుకు వ్రాయరు చెప్పండి?" కమల నిలదీసినట్లే అన్నది.

"ఎవరిమట్టుకు వాళ్ళు వాళ్ళ యిళ్ళు,వాళ్ళ సంసారాలూ, పేరు ప్రతిష్ఠలూ బాగుంటే చాలనుకుంటారు! మన ఆడజాతే యింత! ఎంతటి రచయిత్రులైనా, మరెంతటి సంస్కర్తలైనా ఇంతే మన దేశంలో!" ఆవేశంగా అనేసింది అంతకుముందు గెజిటెడ్ ఆఫీసర్ భార్యనంటూ గర్వంగా చెప్పుకొన్నామె.

అంతకుముందు ఏమాత్రపు పరిచయమూ లేకపోయినా, ప్రథమసమావేశంలోనే ఒక వ్యక్తిపై ఇంత చొరవగా విమర్శ కురిపించగల ఆమె తెగింపు నన్ను ఆశ్చర్యపరచటమే కాదు, గాయపరచింది కూడా.

అయినా నేను తొణకలేదు.

"ఎవరి సౌఖ్యం వెనుకనైనా సరే నియమ నిష్ఠానుసారమైన కఠిన సాధన, కష్టనిష్ఠూరాలకు ఓర్చిన సహిష్ణుత, త్యాగమే కానీ లాలసత నెరుగని జీవన సరళి వుంటాయని మీరు గ్రహించాలి ముందు.చెట్టునుండి సునాయాసంగా కోసుకోగల ఫలాలుకావు సుఖ సంతోషాలనేవి."

"అబ్బో అబ్బో. పెద్ద పెద్ద మాటలు వేసేస్తున్నారండోయ్," గోలగా అన్నారు.

"ఓ! పోనీయండి ఆ విషయం. స్త్రీకిగల కష్టాలు ఏమిటేమిటనేవి మనం అసలు సమీక్షించుదాం. సరేనా? అవేమిటో మీరే చెప్పండి" అన్నాను.

కమల ఠపీమని జవాబుగా మాట్లాడింది. "ఏమిటండోయ్ అంత క్రొత్తగా అడుగుతున్నారు? ఆడవాళ్ళకు మగవాళ్ళతో సమానత్వ మెక్కడేడిపింది? మగాడేమో ఎంత స్వేచ్ఛగానైనా తిరగొచ్చా? ఆడదిమాత్రం మొగుడూ పిల్లలూ ఇల్లే లోకమని కూర్చోవాలా? ఇదెక్కడి న్యాయం? మీరూ అవే



JYOTHI Deepavali Special 1977

సమర్థిస్తూ వ్రాస్తారుగా? ఆడది ఈ శృంఖలాల నెలా ఛేదించాలనేది మీరు వ్రాసిన రెండుకనీ?" ఆవేశంతో అరుణవర్ణం దాల్చింది కమల కంఠం.

నా సమాధానం వినటానికి అన్ని ముఖాలలో ఆత్రత తాండవించుతోంది. కొందరి కండ్లలో నిర్లక్ష్యం కూడా!

"చూడండి కమలగారూ" నేను ప్రారంభించాను. "ఇల్లూ భర్తా సంతానం తర్వాతే స్త్రీకి ఏదైనానని నేను ఇప్పుడు కూడా అంటున్నాను; ఎప్పటికీ అంటాను."

"ఆఁ???"

"ఔను. ఎందుకంటే అది మన సంస్కృతికి ఆయువుపట్టు. సంస్కృతి — జాతి సంస్కృతి — దేశసంస్కృతి — ఒక్క మాటలో భారత సంస్కృతి. సంస్కృతి తరతరాలుగా యుగయుగాలుగా మార్పు లేకుండా మార్చబడలేకుండా నిలచేది. ఆ సంస్కృతిని ప్రతిబింబింపజేసేదీ, పలువురికీ చాటిచెప్పేదే అసలైన రచన. నవలను విదేశీయుడు చదివినా, తద్వారా అతడికి మనదేశ సంస్కృతి గ్రాహ్యం కావాలి. నేను వ్రాసిన "చక్రభ్రమణం" "పూజారిణి" నవలలలో మన జాతి సంస్కృతి బాగా ప్రతిబింబించుతుంది."

"అందుకే మాకవి నచ్చలేదు" ముక్త కంఠంతో అన్నారు. "ఆ సంస్కృతిని స్వర్గంలో ఊరేగ మనండి. మాకక్కర్లేదు."




ఎప్పటికప్పుడు
అధునాతనమైన
డిజైన్లలో కంటికింపైన
రంగులలో... టెరిన్...
టెరివూల్... టెరికాటన్...
సూటింగులు...
షర్టింగులు...
అన్ని రకాల మిల్లుల
వస్త్రములు మా ప్రత్యేక
ప్రిన్స్ షోరూమ్ లో
లభించును!
నేడే దయచేయండి!
ఫోన్: 77801
ప్రిన్స్ షోరూమ్
గవర్నరుపేట, విజయవాడ-2.


"నన్ను పూర్తిగా చెప్పనీయండి." నేను మరలా ప్రారంభించాను. "మీరన్నట్లుగా శృంఖలాలను ఛేదించాలి. నేనూ అంగీకరిస్తాను."

"నిజమే!??" నమ్మలేనట్లే అడిగారు.

"ఔను. ఈ విషయంలో కూడా నేను వ్రాశాను రెండు నవలలలో."

"మాకు తెలియదేమిటీ? మీరన్నీ పాత కాలంగా వ్రాస్తారు. మన స్త్రీల సమస్యలేమి వ్రాశారు?" ఈసడించినట్లే అన్నారు.

"స్త్రీల సమస్యలూ — శృంఖలాలూ అంటున్నారే మీరు—అవి "సూర్యముఖి" "బృందావనం" నవలలలో పూర్తిగా వ్రాశాను. ఈ దురాచారాలకు వేరు పురుగులు ఎక్కడ వున్నాయో నిర్భయంగా సూటిగా చెప్పాను."

కమల, లక్ష్మిల ముఖాలలో కాంతి తగ్గిన మాయమైంది. అంతవరకూ నన్ను సూటిగా చూస్తూ మాట్లాడుతున్న వారల్లా అటు యిటు దిక్కులు చూడసాగారు.

మిగిలినవారు ఉత్సాహంగా, ఏకాగ్రతతో, గౌరవంగా వింటున్నారు.

"ఇందులో యుగధర్మం కన్పట్టుతుంది. కాల పరిభ్రమణంలో సంఘ నియమాలలో స్వల్పంగానో అధికంగానో వక్రీకరణ జరుగుతుంది. సంస్కృతి నుండి భిన్నంగా చీల్చుకుపోయే ఈ మార్పులవల్ల ఏర్పడే సమస్యలూ సంఘర్షణలూ యిటీవల చాలా నవలలలో వస్తున్నాయి. అయితే అంతమాత్రాన మనుషుల హృదయాలలో మార్పులు వస్తున్నాయా? దురాచారాలు సమసిపోతున్నాయా?"

ఎవరూ మాట్లాడలేదు.

"బృందావనం నవలలో ఒక భోగస్త్రీ కుమార్తె గౌరవమైన గృహిణీ జీవితం గడపటానికి ఎన్ని కష్టాలను ఎదుర్కోవలసి వచ్చిందో, ఆఖరికి ఎలా తనువు చాలించిందో హృదయంగమంగా చిత్రించాను.... "సూర్యముఖి" నవలలో మరో సమస్య— నిష్కారణంగా భార్యను వదలి మరో స్త్రీని చేపట్టుతాడు ఒక పురుషుడు. ఆమె మరో వివాహం చేసుకున్నది. ఇది శృంఖలాలను ఛేదించే అభ్యుదయాత్మక రచన కాదంటారా మీరు?"

కమల నీరసంగా అంగీకారం సూచించింది.

"ఏమో. ఆ పుస్తకాలు నేనసలు చదవలేదు" అంటూన్న లక్ష్మి అబద్ధం చెప్తున్నట్లనిపించింది నాకు.

"పోనీండి. ఇటువంటి స్త్రీలు అనగా 'బృందావనం' 'సూర్యముఖి' నవలల నాయికలు నిజజీవితంలో మనకు తారస పడ్డారనుకోండి. అప్పుడు మన ప్రవర్తన ఎలా వుండాలో మనం ఆలోచించుకోవాలి. అటువంటి యువతులను మనం మన కుటుంబంలోనికి ఆహ్వానించగలమా? ఆహ్వానించగలవారు మీలో ఎవరైనా వున్నారా?"

అడుగుతూ అందరి ముఖాలూ చూచాను.

"అబ్బ. తలనొప్పిగావుంది. క్షమించండి." లక్ష్మి నిష్క్రమించింది.

"అన్నట్టు మావారు నన్ను త్వరగా రమ్మన్నారు. వెళ్తున్నాను. ఇప్పటికే లేటైంది. సారీ," శృంఖలాలను త్రెంచాలనే కమల చకచకా నడచిపోయింది, ఆ నినాదాన్నే విస్మరించినట్లుగా.

"మీరేమంటారు?" మిగిలిన వార్ని అడిగాను.

కొందరు యితరుల ముఖాలు చూడ సాగారు.

"ఆరోజులు....అబ్బో! ఇంకా చాలా దూరంలో వున్నాయిలెండి మనకి" అన్నదొకామె.

"ఎంతైనా అంటూ, ఆచారం, సంప్ర యం అనేవి వున్నాయి కదండీ? అడ్డమై ళ్ళనీ ఇళ్ళల్లో ఒకళ్ళుగా ఎలా చేసు ంటాం?" నాగరిక వేషంలో వున్న ఓ ట్రైటూరావిడ సెలవిచ్చింది.

"చూశారా మరి? శృంఖలాలను త్రెంచ నికి ఎంతచేవ అవసరమో? అదిలేని ఓటు బ్బా చప్పుళ్ళు ఎందుకు చెప్పండి?"

నా ప్రశ్నకు సమాధానం రాలేదు.

రాదని నాకు ముందే తెలుసు.

ఎప్పటికి రాగలదో మాత్రం నాకు తెలి దు. 'శృంఖలాలను ఛేదించండి'—అని నదించడం తేలికే. కాని ఆచరణ? ఎక్క న్నారు అవి తెంపగలవారు? 'పిల్లి డలో గంట కట్టగలవారెవరు?'

అందరూ నిష్క్రమించాక కరుణా నేనూ శీగా కబుర్లలో పడ్డాం.

"సారీ! ఈ మనుషులే యింత. ఒకచే ర్పాటం. మీకు చాలా 'ట్రబుల్' యిచ్చే శ్నలు వేశాననుకుంటాను?" అన్నది రుణ.

"నేను వ్రాసే విషయాలనుగురించి రింత విపులంగా విమర్శతో మాట్లాడ నికి నాకు కష్టమేముంది? నామాటలే వాళ్ళని ట్రబుల్'లో పెట్టినట్లు అనుకుంటున్నాను. ందుకే అలా పారిపోయారు!"

"నిజమేనండోయ్. ఆ లక్ష్మి లేదూ— ఆమె పెళ్ళాడిన అతడికి అంతకుముందే భార్యా నలుగురు పిల్లలూ వున్నారు. వాళ్ళను పుట్టింటికి తోలేశాడు. ఈమెతో కులుకుతున్నాడు. ఇక ఆ కమల భర్త, అసలు ఒక భోగం అమ్మాయితో ప్రేమలోపడి పెళ్ళి చేసుకోవాలనుకున్నాడుట. అయితే ఈవిడా, ఈమె తండ్రీ ఆ పిల్లని బెదిరించి ఏదో మోసం చేశారట. తర్వాత మాయోపాయంతో అతడిని పెళ్ళి చేసుకుందట! ఈ విషయం ఇక్కడ చాలామందికి తెల్సు. అందుకే ఆ భార్యా భర్తల నడుమ అంత సఖ్యతలేదని అనుకుంటారు. అనుకోవడమేమిటీ—నిజమే! వాళ్ళ పనిమనిషీ మా పనిమనిషీ ఒక్కతేగా?"

ఆ తర్వాత ఎప్పుడూ ఆ బృందంలోనివారెవరూ నన్ను ఏ సమావేశానికీ పిలువక పోగా, ఏ షాప్‌లోనో, థియేటర్‌లోనో ఎప్పుడైనా కన్పించినా ఎరుగనట్టే తప్పుకుపోతుంటారు.

"అబ్బో! ఆవిడ రచనలను విమర్శించిన వారిపై ఆవిడకు చాలా కోపమండోయ్ బాబూ. అందరూ తననే పొగడాలనుకుంటుంది" అని దుష్ప్రచారం చేస్తున్నట్లుగా విన్నాను ఆ తర్వాత. *

